అంతర్జాతీయ సదస్సులో వీసీ

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి డీమ్డ్ యూనివర్సిటీ వీసీ యువరాజు చిన్నం అంతర్జాతీయ సదస్సులో పాల్గొన్నారు. హేగ్ నగరంలో రెండు రోజుల పాటు సాగిన వస్ సదస్సులో పాల్గొన్న ఆయన హెచ్‌సీఎస్ఎస్ ప్రతినిధి సోఫియా రోమాన్స్కీతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. సదస్సులో పాల్గొనడం వల్ల అంతర్జాతీయ స్థాయిలో సత్సంబంధాలు నెలకొనడంతో పాటు ఆయా సంస్థలతో పరిచయాలు పెరుగుతాయని ఆయన తెలిపారు.

జెండావిష్కరణ



మేడ్చల్‌రూరల్: ఆర్ఎస్ఎస్ స్థాపించి శతాబ్దం పూర్తయిన సందర్భంగా గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో గురువారం బ్రాహ్మణ పండితులు బాబు భగవత్ ధ్వజాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు విక్రంరెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ మోహన్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ మల్లికార్జున్ ముదిరాజ్, అధ్యక్షుడు శ్రీధర్, నాయకులు శ్రీనివాస్ ముదిరాజ్, కిషన్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



సయ్యద్ అలీ హుస్సేన్ రజ్వీ

జవహర్‌నగర్: వ్యక్తి అదృశ్యమైన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జవహర్‌నగర్ అరుంధతినగర్‌లో సయ్యద్ అలీ హుస్సేన్ రజ్వీ (48) ర్యాపిడో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. భార్య జరీనా ఫాతిమా కుటుంబసభ్యులతో కలిసి ఉంటున్నాడు. ఈనెల 1న అలీ హుస్సేన్ రజ్వీ ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. దీంతో ఆచూకీ కోసం గాలించినా ఫలితం లేకపోవడంతో జవహర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి ఆత్మహత్య

పోచారం: యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన ప్రకారం .. అన్నోజిగూడలోని రాజీవ్ గృహకల్ప కాలనీకి చెందిన పిపల్ల మణికంఠ (25) అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి సమయంలో ఇంట్లో ఉరేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స కోసం జీడిమెట్లలోని ఓ హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడు..

కుషాయిగూడ: ఆర్థిక ఇబ్బందులు తాళలేక యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్థాన్‌కు చెందిన ప్రసన్న వైష్ణవ్, మదన్‌దాస్ వైష్ణవ్ దంపతులు. 30 ఏళ్ల క్రితం పిల్లలతో కలిసి బతుకుదెరువు కోసం నగరానికి వలస వచ్చారు. 2022 లో మదన్‌దాస్ చనిపోయాడు. చిన్న కొడుకు కుశీ్వర్ వైష్ణవ్ (18) కుషాయిగూడలోని తన సమీప బంధువుకు చెందిన పరాస్ జువెల్లరీలో పనిచేస్తూ అదే భవనంలో రెండో అంతస్తులో నివాసం ఉంటున్నాడు. కాగా తల్లి మరోచోట ఉంటోంది. తండ్రి చనిపోవడంతో ఇంటి బాధ్యతలతో పాటు ఆర్థిక ఇబ్బందులు పెరిగాయి. ఈ క్రమంలో తన గదిలోనే శుక్రవారం ఉదయం ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శుక్రవారం దుకాణం తెరిచిన యజమాని రాజుశర్మ ఫ్యాన్‌కు వేలాడుతున్న వైష్ణవ్‌ను గుర్తించాడు. ఇరుగు పొరుగు సాయంతో వైష్ణవ్‌ను కిందికి దించి చూడగా అప్పటికే మృతిచెందాడు. దీంతో తల్లిదండ్రులు, పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఆధారాలు సేకరించారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న పలువురి అరెస్టు

కుషాయిగూడ: గాంధీ జయంతి రోజు అక్రమంగా మద్యం విక్రయిస్తున్న యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. హెచ్‌బీకాలనీకి చెందిన వల్లపు కుమారస్వామి గుట్టుగా మద్యం విక్రయిస్తున్న విషయం తెలుసుకున్న పోలీసులు ఆకస్మికంగా దాడులు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అక్కడ లభ్యమైన మద్యాన్ని స్వాధీనం చేసు కుని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చర్లపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో..

చర్లపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో గాంధీ జయంతి రోజు అక్రమంగా మద్యం విక్రయిస్తున్న నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి సుమారు రూ. 85 వేల విలువైన మద్యాన్ని స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



కొండాపూర్‌లో స్మారక స్థూపం వద్ద వేడుకలు



ఘట్‌కేసర్‌లో రావణ దహనానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన ప్రజలు



పూడూర్‌లో రావణ దహనం..

వైభవంగా విజయదశమి

అంబరాన్నంటిన సంబురాలు / శమీ, ఆయుధ పూజలు

మేడ్చల్ నియోజకవర్గవ్యాప్తంగా గురువారం దసరా సంబరాలు అంబరాన్నంటాయి. ఈ సందర్భంగా శమీ, ఆయుధ పూజలు నిర్వహించగా నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అలాగే పలుచోట్ల రావణ దహన కాండ కార్యక్రమాలు చేపట్టగా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై తిలకించారు.

–మేడ్చల్ జోన్ బృందం



మేడ్చల్‌లో రావణ దహనం



డబీల్‌పూర్‌లో శమీ చెట్టుకు పూజలు చేస్తున్న గ్రామస్తులు



ఘట్‌కేసర్ గురుకుల్ మైదానంలో శమీ పూజ ..



చీర్యాల శ్రీలక్ష్మీనర్సింహస్వామి దేవస్థానంలో శమీపూజ..

ఓపెన్ జిమ్ ప్రారంభం

మల్కాజిగిరి: ఎస్ఎండీసీకాలనీ నుంచి జెట్టీసీ వెళ్లే మార్గంలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్న స్థలాలను గుర్తించి పార్కులుగా అభివృద్ధి చేసి ఓపెన్‌జిమ్ ఏర్పాటు చేస్తామన్నారు. కాలనీ సంక్షేమ సంఘాలు కూడా వాటి నిర్వహణ బాధ్యత తీసుకోవాలన్నారు. వెంకటేశ్‌యాదవ్, ఉమేష్‌సింగ్, సత్యమూర్తి, బీకె శ్రీనివాస్, బాబు, సత్యనారాయణ పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో శుక్రవారం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. డా. జ్యోతి శేఖర్ శిష్య బృందంచే నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. మామవతు శ్రీ సరస్వతి, కులుకాగా నడవరో, అలరులు కురియగా, చక్కని తల్లికి, ఒకపరి కొకపరి, కామాక్షి స్తుతి, జయ జయ దుర్గే తదితర అంశాలను కళాకారులు ప్రదర్శించి మెప్పించారు. కార్యక్రమంలో వైష్ణవి, హేమలత, అంవిత, పావని, ఈషా, నాగమణి, సహాన్య, హనిషా ఉన్నారు.

నిధుల్లేక.. నీరసం..!

భారమవుతున్న పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీల నిర్వహణ

- విడుదల కానీ హెచ్‌డీఎస్ నిధులు
- వసతుల్లేక రోగులకు తప్పని తిప్పలు
- నగర శివారుల్లో 38 అర్బన్, గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు
- 70పల్లె , 112 బస్తీ దవాఖానాలు



సాక్షి,మేడ్చల్ జిల్లా: నిధుల లేమితో నగర శివారు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్వహణ భారమవుతోంది. ప్రభుత్వం ఏటా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్వహణకు హెచ్‌డీఎస్ (హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ) ద్వారా ఒక్కో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రూ.1.75 లక్షలు అందజేస్తోంది. అయితే ఈ నిధులు కూడా 3 లేదా 6 నెలలకు ఒకసారి విడుదల చేస్తుండడంతో ఆరోగ్య కేంద్రాల నిర్వహణ ఇబ్బందికరంగా మారుతోందని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వైద్యారోగ్య శాఖ సకాలంలో నిధులు విడుదలపై శ్రద్ధ చూపకపోవటంతో.. వసతుల్లేక రోగులకు తిప్పలు తప్పడం లేదు. నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో మొత్తంగా 38 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. ఇందులో 26 యూపీహెచ్‌సీలు ఉండగా, పీహెచ్‌సీలు 12 ఉన్నాయి. వీటి పరిధిలో 70 పల్లె దవాఖానాలు, 112 బస్తీ దవాఖానాలు ఉన్నాయి. అలాగే, 8 పీహెచ్‌సీలు, 5 యూపీహెచ్‌సీలు రోగులకు 24 గంటల వైద్య సేవలు అందిస్తున్నాయి. అయితే నిధుల లేమితో ఇన్‌పెషెంట్లకు తాగునీరు, మూత్రశాలలు, మరుగుదొడ్ల వసతి కల్పించలేని దుస్థితి ఏర్పడుతోంది. ఇటీవల కలెక్టర్ పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేసి మూత్రశాలలు, మరుగుదొడ్లను పరిశీలించారు. నిర్వహణ సక్రమంగా లేకపోవడం, అపరిశుభ్రంగా ఉండడంతో జిల్లా వైద్యాధికారిని ఆరా తీసిన కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. అంతేగాకుండా వివిధ రకాల పరీక్షలను బయటకు రాస్తుండటంతో ఇక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉండి.. లాభమేంటన్న ప్రశ్నలు పలువురి నుంచి ఉత్పన్నమవుతున్నాయి. నిధులు విడుదల కాకపోవడం వల్లే ఆరోగ్య కేంద్రాల నిర్వహణ కష్టమవుతోంది. దీనిని గుర్తించిన కలెక్టర్ తన నిధి నుంచి తక్షణమే ఆరోగ్య కేంద్రాల నిర్వహణకు నిధులు విడుదల చేసినట్లు జిల్లా వైద్యారోగ్యశాఖ వర్గాలు పేర్కొంటున్నారు. ఈ విషయమై పీహెచ్‌సీ సిబ్బంది మాత్రం ప్రభుత్వం నుంచి నిర్వహణ నిధులు రావడం లేదని పేర్కొంటున్నారు. ఇవేగాకుండా ఇతర పథకాలకు సంబంధించిన నిధులు కూడా విడుదల కాలేదంటున్నారు. ఈ విషయాన్ని ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు చెబుతున్నారు. నిధులు విడుదల కాగానే సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వసతుల పరంగా ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చూస్తామని సంబంధిత శాఖ ఉన్నతాధికారులు పేర్కొంటున్నారు.

షిర్డీ సాయిబాబా సమాధి ఉత్సవాలు

గౌతంనగర్: సాయినగర్‌లోని ఆలయంలో షిర్డీ సాయిబాబా సమాధి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. కార్పొరేటర్ మేకల సునీతారాముయాదవ్ శుక్రవారం సాయిబాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు మేకల రాముయాదవ్, భక్తులు పాల్గొన్నారు.

ముగిసిన వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు



గౌతంనగర్: ఓల్డ్ మిర్జాలగూడలో వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం ముగిశాయి. చివరిరోజు శాంతి తిరుమంజనం, అన్నకోటి, తీర్థ ప్రసాద వినియోగం, కార్యక్రమాలు నిర్వహించి ఉత్సవాన్ని సమాప్తం చేశారు. కార్యక్రమంలో శ్రీఆంజనేయ సేవా భక్త బృందం, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ మృతి

కుషాయిగూడ: విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ మృతి చెందిన ఘటన కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. అబ్దుల్లాపూర్‌మెట్ గౌరెల్లికి చెందిన పి. శివకుమార్ ఎలక్ట్రీషన్. గత బుధవారం కుషాయిగూడ వేంటేశ్వరస్వామి ఆలయంలో కరెంట్ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో కింద పడిపోయాడు. గమనించిన స్థానికులు వెంటనే చికిత్స కోసం స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పోలీస్ పహారాలో దసరా



గ్రామస్తులతో మాట్లాడుతున్న పోలీసులు

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ మున్సిపాలిటీ పూడూరులో దసరా వేడుకలు పోలీస్ పహారాలో సాగాయి. పండుగ సందర్భంగా జెండా ఎగురవేసే విషయంలో గ్రామస్తులు రెండు వర్గాలుగా చీలిపోవడంతో వివాదం తలెత్తి ఏటా వారం ముందు నుంచే ఉద్రిక్త వాతావరణం ఏర్పడుతోంది. ఈసారి కూడా ఇరువర్గాల మధ్య తగాదా తలెత్తింది. దీంతో దసరాకు నాలుగైదు రోజుల ముందు నుంచే పోలీసులు, మున్సిపాలిటీ అధికారులు పోలీస్‌స్టేషన్‌లో ఇరువర్గాలతో పలు దఫాలుగా చర్చలు జరిపి ఏకతాటిపైకి తీసుకువచ్చేందుకు విశ్వప్రయత్నాలు చేశారు. అయినా ఏకాభిప్రాయానికి రాకపోవడంతో పోలీస్ పహారాలో జెండా ఎగురవేయకుండా ఉత్సవాలను ముగిశాయి.

2019 నుంచి వివాదం..

పూడూరులో ఆది నుంచి రెడ్డి వర్గానికి చెందిన మజ్జిగ కుటుంబం దసరా సందర్భంగా జెండాను ఎగురవేస్తూ వస్తోంది. ఎన్టీఆర్ హయాంలో పట్వేల్, పట్వారీ వ్యవస్థలు రద్దు కావడంతో ప్రజాప్రతినిధులు జెండాను ఎగురవేసి, ఉత్సవాలను ప్రారంభిస్తున్నారు. పూడూరులో మాత్రం అదే వ్యవస్థ కొనసాగుతుండడంతో 2019 సర్పంచ్ గెలిచిన బాబు యాదవ్ వర్గం ఈ అనవాయితీని వ్యతిరేకించింది. ఈ విషయంలో ఇరువర్గాల మధ్య పెద్ద ఎత్తున వాదోపవాదాలు జరిగాయి. పోలీసులు లాఠీచార్జి చేయడం, పలువురిపై కేసులు నమోదు చేశారు. అప్పటి నుంచి రెడ్డి వర్గం ఎప్పటిలాగే గ్రంథాలయం వద్ద, మిగితా బీసీ, ఎస్సీ వర్గాలు గాంధీ విగ్రహం వద్ద వేర్వేరుగా జెండాను ఎగుర వేస్తున్నారు. రావణ దహనం కూడా వేర్వేరుగా చేస్తున్నారు. కాగా సమస్యను పరిష్కరించేందుకు పోలీసులు గతేడాది ఇరువర్గాలతో చర్చించగా ఒక ఒప్పందానికి వచ్చాయి. ఈ ఒకసారి మాత్రమే తాము జెండా ఎగురవేస్తామని, ఆ తర్వాత నుంచి ప్రజా ప్రతినిధులు లేదా అధికారులు జెండా ఎగురవేసేందుకు అంగీకరిస్తున్నట్లు మజ్జిగ సుధాకర్‌రెడ్డి, రెడ్డి వర్గంలోని పలువురు రాత పూర్వకంగా ఒప్పందం చేసుకుంది. ఈ మేరకు గతేడాది దసరా సందర్భంగా ఒకే జెండాను ఎగురవేశారు.

పూడూర్‌లో వేడుకల నిర్వహణ

మళ్లీ రాజుకున్న వివాదం

గతేడాది నిర్ణయం ప్రకారం ప్రస్తుతం ప్రజాప్రతినిధులు లేని కారణంగా కమిషనర్ పూడూరులో జెండా ఎగురవేయాలని మాజీ సర్పంచ్ బాబుయాదవ్ వర్గం పట్టుబట్టగా, మాజీ సర్పంచ్ నర్సింహారెడ్డి, రెడ్డి వర్గం ప్రజాప్రతినిధులు లేని కారణంగా బయటి నుంచి వచ్చే వారు గ్రామంలో జెండాను ఎగురవేయవద్దనే వాదనను తెరమీదికి తీసుకువచ్చింది. దీంతో ఇరువర్గాల్లో ఏకాభిప్రాయం తీసుకువచ్చేందుకు మేడ్చల్ ఏసీపీ శంకర్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ చంద్రప్రకాశ్ పలుమార్లు ఇరువర్గాలతో చర్చించినా ఏకాభిప్రాయానికి రాలేదు. ఇరువర్గాల వారు వేర్వేరుగా పండుగ కోసం ఏర్పాట్లు చేసుకుంటుండడంతో 40 మందికి పైగా పోలీసులు గురువారం గ్రామంలో బందోబస్తు నిర్వహించారు. ఇరువర్గాల ముఖ్యులను ముందుగానే అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. జెండా ఎగురవేయకుండా పండగ జరుపుకునేలా పోలీసులు చర్యలు చేపట్టడంతో గ్రామస్తులు చివరకు జెండా ఆవిష్కరణ లేకుండానే రావణదహన కార్యక్రమంలో పాల్గొని వేడుకలు జరుపుకున్నారు. ఆ తర్వాతే ఇరువర్గాల నేతలను పోలీసులు వదిలిపెట్టారు.

సంస్కరణలతో ఖైదీల జీవితాల్లో వెలుగు



మాట్లాడుతున్న న్యాయమూర్తి బాలభాస్కర్

కుషాయిగూడ: తెలంగాణ జైళ్లశాఖ చేపడుతున్న సంస్కరణలు ఖైదీల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని న్యాయమూర్తి వి. బాలభాస్కర్ అన్నారు. చర్లపల్లి కేంద్ర కారాగారంలో గురువారం నిర్వహించిన గాంధీ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. పేద ఖైదీలకు న్యాయ సహాయం అందించే పూర్ ప్రిజనర్స్ స్కీమ్‌ను ఖైదీలకు వివరించి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జైళ్లశాఖ ఐజీ మురళీబాబు మాట్లాడుతూ.. ఖైదీల వేతనాలు పెంపు మంచి ఆహారం అందించడంతో పాటుగా ఆరోగ్య కార్యక్రమాలను చేపడుతూ వారి సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సి. ఉమాగౌరి ఖైదీలకు కావాల్సిన వైద్యసేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. మల్కాజిగిరి అడిషనల్ కమిషనర్ వెంకటరమణ, అమ్మ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ అనిల్, జైల్ పర్యవేక్షణాధికారి ఎస్. శివకుమార్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మాధవి, శశికాంత్ తదితరులు పాల్గొన్నారు.

మహాత్ముడికి ఘన నివాళి

నియోజకవర్గవ్యాప్తంగా మహాత్మా గాంధీ జయంతి వేడుకలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, ప్రజాప్రతినిధులు ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అలాగే దేశానికి ఆయన చేసిన సేవలను పలువురు కొనియాడారు.

– మేడ్చల్ జోన్ బృందం



గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ



మేడ్చల్ లో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు



ఘట్‌కేసర్‌లో వేడుకల్లో ముత్యాలు, రాధాకృష్ణ, కాంగ్రెస్ నాయకులు

రాయితీ రుణాలు అందేదెన్నడో..?

నిరుద్యోగుల నుంచి దరఖాస్తుల స్వీకరణ

- రాష్ట్ర అవతరణ రోజునే అందించాల్సిన వైనం
- 4 నెలలు కావస్తున్నా.. అందని మంజూరు పత్రాలు
- జిల్లాలో వచ్చిన అర్జీలు 66,648



సాక్షి,మేడ్చల్ జిల్లా: జిల్లాలోని నిరుద్యోగ యువత రాయితీ రుణాల కోసం ఎదురు చూస్తున్నారు. ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ శాఖల అధికారులు రాజీవ్ యువ వికాసం పేరిట దరఖాస్తులు స్వీకరించగా, ప్రభుత్వపరంగా ఉద్యోగాలు అంతంతమాత్రంగా ఉండడంతో ఈ పథకంతో స్వయం ఉపాధికి బాటలు వేసుకోవచ్చన్న ఉద్దేశంతో యువత పెద్ద సంఖ్యలో దరఖాస్తు చేసుకున్నారు. అయితే తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజు జూన్ 2న మంజూరు పత్రాలు అందజేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో నిరుద్యోగ యువతలో హర్షతీరేకాలు వ్యక్తమయ్యాయి. అయితే 4 నెలలుగా ప్రభుత్వం మంజూరు పత్రాలు అందించకపోగా, అవి ఎప్పుడూ అందుతాయో కూడా తెలియని పరిస్థితి నెలకొన్నది.

భారీగా దరఖాస్తులు

రాజీవ్ యువ వికాసం పథకానికి నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 66,648 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో అత్యధికంగా బీసీ సామాజిక వర్గం నుంచి బీసీ కార్పొరేషన్ కింద 13,400 యూనిట్ల లక్ష్యం కాగా, 37,935 మంది అర్జీలు అందించారు. రూ.50 వేల యూనిట్‌కు బ్యాంక్ రుణంతో సంబంధం లేకుండా వంద శాతం రాయితీ ఉండనున్నది. మిగతా యూనిట్లకు గరిష్టంగా రూ. 4 లక్షల వరకు ఎంచుకునే అవకాశం కల్పించగా రాయితీ 70 శాతం ఉంటోంది.

కమిటీలు ఏర్పాటు చేసినా..

శాఖల వారీగా అందిన దరఖాస్తులను మండల, మున్సిపల్ స్థాయి కమిటీలు పరిశీలించి లబ్ధిదారులను ఎంపిక చేయాల్సి ఉంది. కమిటీల్లో ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, మండల, పట్టణ ప్రత్యేకాధికారులు, ఐకేపీ ఏపీఎం, సంక్షేమ శాఖల తరపున సిబ్బంది, బ్యాంకు అధికారులకు స్థానం కల్పించారు. అయినా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ముందుకు సాగకపోవడంతో కమిటీలు నిస్సహాయ స్థితిలో ఉన్నాయి. ఇదిలా ఉండగా, ఉపాధి కల్పన లక్ష్యంగా రాయితీ రుణం కోసం దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగ యువత మాత్రం 4 నెలలుగా ప్రభుత్వం తీసుకునే నిర్ణయం కోసం ఎదురు చూస్తున్నారు.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో వచ్చిన దరఖాస్తులు

సామాజికవర్గం	దరఖాస్తులు	యూనిట్ల లక్ష్యం
ఎస్సీ	16,300	6,201
ఎస్టీ	2,196	1,594
బీసీ సంక్షేమ శాఖ	37,935	13,400
మైనార్టీలు	10,217	3,415